# చీర

ఇక ఎన్నడూ చీర కట్టుకోకూడదని డ్రస్సులు మాత్రమే వేసుకోవాలని గట్టి నిర్ణయం తీసుకుంది జలజాక్షి. ఒకవేళ కట్టుకున్నా ఇల్లు దాటి బయటికి వెళ్ళేటప్పుడు అస్సలు కట్టుకోకూడదని నిర్ణయించుకుంది. మూడు పదులు నిండిన జలజాక్షి, ఇద్దరు బిడ్డల తల్లి జలజాక్షి తన నిర్ణయాన్ని ఎలా అమలుపరుస్తుంది? జరిగినదంతా విని జలజాక్షి మొగుడు ఉగ్రుడయ్యాడు. పోలీసు రిపోర్టు ఇస్తే! ఏమని ఇస్తారు? రకరకాలుగా ఆలోచించాడు చివరికి చల్లబడ్డాడు.

ఈ వయసులో పంజాబీ దుస్తులు వేసుకుంటుందా? లేకపోతే చొక్కా, పాంటూ తొడుక్కుంటుందా? ఇదే పదేళ్ళ క్రితం బిడ్డలు పుట్టని వయసులోనైతే - బాగుండి ఉండును. అప్పణ్ణించీ ప్రారంభిస్తే ఈపాటికి ఆ దుస్తులు అలవాటయిపోను.

ఇప్పుడెలా ప్రారంభించడం?

ఏమయినా సరే - బయటికి వెళ్ళేప్పుడు ఇకచీర కట్టుకోదు.

ఇంట్లోనే ఉషా కుట్టు మిషనుంది. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు బట్టలషాపు నుంచి బట్టలు తెచ్చిచ్చాడా భర్త. కష్టపడి కుట్టుకుంది. జలజాక్షికి కుట్టుకోవడం బాగానే ఉందంది. ఎదురింటి మేడలో వుండే సావిత్రమ్మ - బుగ్గలు నొక్కుకుంది.

జలజాక్షి ఈ నిర్ణయం ఎందుకు తీసుకుందో ఎవ్వరికీ తెలియదు. ఎలా తెలుస్తుంది చెప్పకపోతే? తమ మాత్రం ఎలా చెబుతుంది?

ఆ రోజు జరిగిన సంగతి గుర్తొస్తే భయంతో వళ్ళంతా జలదరిస్తుంది.

సత్యనారాయణ ఆఫీసు పనిమీద రాజమండ్రి వెళ్ళాడు. జలజాక్షి పిల్లల్ని చూస్తుండమని పక్కవాటాలో వున్న మామ్మగారికి అప్పగించి సెకండ్‌షోకు వెళ్ళింది. నాలుగు రోజుల్నించి ఒక్కద్దానికీ తోచడంలేదు. ఎంతకని టీవీ చూస్తుంది. ఎంతకని వారపత్రికలు తిరగేస్తుంది?

పెళ్ళయిన కొత్తలో సెకండ్‌షోకు వెళ్ళేవారు. సత్యనారాయణ ఆఫీసు నుంచి వచ్చేసరికి పొద్దుపోయేది. కనుక ఫస్టుషోకు కుదరదు. కనుక అన్ని పనులూ తెముల్చుకుని సెకండ్ షోకు వేళ్ళేవారు. ఆఫీసు పది గంటలకి కదా. ఎంతో నిదానంగా వంట పూర్తయ్యేది. అతను కేరియర్ పట్టుకుని పావుతక్కువ పదికి ఆఫీసుకు బయల్దేరేవాడు.

నాటికి నేడు దాదాపు సుమారు ఆరేళ్ళ తరవాత సెకండ్ షోకు బయల్దేరింది, పని మనిషిని మంగమ్మని సాయం తీసుకుని. వెధవ సినిమా వెధవ సినీమాని, మరీ బరి తెగిస్తున్నారు. డబ్బు పోసి, ప్రలోభపెట్టి వయసులో వున్న ఆడపిల్లల్ని కొని గుడ్డలిప్పి డాన్సులు చేయిస్తున్నారు. చీఛీ - రానురాను మరీ ఘోరంగా తయారవుతున్నాయి - అనుకుంటూ బయటికొచ్చింది. పెద్ద వీధి మలుపులోకి వచ్చేక

- 'నువ్విక ఇంటికి వెళ్ళిపో మంగా - సందు తిరగితే ఇల్లొస్తుంది. నాకేం భయంలేదు' అని పనిమనిషిని పంపించేసింది.

పెద్దవీధి లోంచి వెళితే చాలాదూరం అని సన్నటి సందులోకి మళ్ళింది. ఆ సందు తిన్నగా తమ వీధిలోకి తీసుకువెళ్తుంది. దగ్గిర దారి - గబగబా అడుగులు వేస్తోంది. సమయం రాత్రతి పన్నెండు దాటింది. హఠాత్తుగా కరెంటు పోయింది. కాస్త జడిసింది. కరెంటు పోవటం అలవాటే - ఆ సందులోంచి నడవటమూ అలవాటే.... వొంటిమీద చేతులుపడ్డాయి. అరవకుండా ఒకచేత్తో నోరు నొక్కి, మరో చేత్తో చీర కుచ్చెళ్ళు లాగుతున్నాడు. బలంగా మోటుగా.... భయంతో గొంతు పెగల్డంలేదు, అయినా అరిచే ప్రయత్నం చేస్తోంది. పెనుగులాడుతోంది. అయిపోయింది అనుకుంటూనే ఉంది. ఆశ వదలకుండా సర్వశక్తులతో ప్రతిఘటిస్తోంది. ఛీ - ఎంత ఘోరం - అయ్యయ్యో - ఎంత అవమానం - సర్వనాశనం అయిపోయింది.

కరెంట్ వచ్చింది. ఎంత హఠాత్తుగా పోయిందో అంత హఠాత్తుగానూ వచ్చింది. లైట్లు వెలిగాయి. పట్టు సడలింది. పెద్దగా అరవనారంభించింది. పారిపోయాడు. నడి వయసు వుండొచ్చు. జాకెట్టు చిరిగిపోయింది. చీర మొత్తం వూడిపోయింది. చిన్నపట్టుతో బొడ్డులోంచి వేలాడుతోంది. గబగబా మెడ తడుముకుంది. మంగళసూత్రం, నల్లపూసల తాడూ భద్రంగానే ఉన్నాయి. చెవులకి లోలకులూ, చేతివేలికి ఉంగరం భద్రంగానే ఉన్నాయి. గాజులు ? గాజులు కూడా ఉన్నాయి. వొళ్ళంతా మట్టి.... జుట్టు రేగిపోయింది.

ఈ అరుపులకి గబగబా తలుపులు తెరుచుకున్నాయి. పదిమందీ చేరారు. కొందరు కుర్రాళ్ళు ఆ దుర్మార్గుణ్ణి పట్టుకుందామని పరుగులు తీశారు. సిగ్గుతో చచ్చిపోయి ఇల్లుచేరింది. అంతా ఒక పీడకలలా జరిగిపోయింది. కేవలం కొద్ది నిమిషాల్లో జరిగిపోయిందింత ఘోరమూను. అక్కడికి ఇల్లు ఒక వందగజాలుంటుందేమో - పరుగు మీద ఇఉల్ల చేరింది.

కరెంటు రాకపోతే ఏమయి ఉండేదీ ? అమ్మో..... దొంగ సచ్చినోడు - ఎంతకి తెగించాడు ?

బ్రతుకుజీవుడా అనుకుంది. వళ్ళంతా నొప్పులు, ఇంకా దడ తగ్గలేదు. ఆ రాత్రి మరి నిద్ర పట్టలేదు. మామ్మగారితో అంతా చెప్పుకుని ఎక్కిఎక్కి ఏడిచింది. ఆ గొడవకి పిల్లల్లేచి వాళ్ళూ ఏడవనారంభించారు. ఇరుగుపొరుగులు లేస్తారేమోనని భయపడింది. వేణ్ణీళ్ళు పెట్టుకుని స్నానం చేసింది - రాత్రి ఒంటిగంటకి ! ఎవడో వెధవ ముట్టుకున్న శరీరం - తాగుబోతు వెధవ - ఆ చీర, ఆ లంగా, ఆ జాకెట్టు, ఆ బాడీ - అన్నీ దూరంగా పెరట్లో పారేసింది. ఇస్త్రీ చీర తీసి కట్టుకుంది. మరి నిద్ర పట్టలేదు. కన్నుమూస్తే భయంగా ఉంది. మామ్మగారు సాయం పడుకున్నారు.

రెండురోజుల తరువాత సత్యనారాయణ ఊరినించి వచ్చి అంతావిని ఉగ్రుడయిపోయాడు. కాని ఏం చేస్తాడు ?

పెళ్ళినాట్కి జలజాక్షి తీగలా ఉండేది. మెరుపు తీగలా వుండేది. ఇప్పుడు కొంచెం ఒళ్ళు చేసింది. ఇంతకంటె వలంగా వుండేవాళ్ళు కూడా పంజాబీ దుస్తులు వేసుకుంటున్నారు. జలజాక్షికేం ? బాగానే ఉంది.

ఒకరోజు పంజాబీ డ్రెస్సు వేసుకుని ఇందుమణితో కలిసి షాపింగ్‌కి వెళ్ళింది. కాళ్ళు పట్టేసినట్టున్నాయి. చాలా కొత్తగా ఉంది. అందరూ తననే చూస్తున్నట్టు - అదోక రకం ఫీలింగు, వొంటికి పట్టినట్టుండే పంజాబీ డ్రెస్సులో వంటిలో వున్న వొంపులూ ఎత్తు లూ పల్లాలూ కనిపిస్తాయి. అది తలంచుకుని చాలా ఇబ్బంది పడింది. చీరకట్టులో వుండే ఇబ్బంది చీర కట్టులో ఉంది. వెనక నడుమూ, ముందుకు పొట్టా కనపడటం, గాలికి పైట రేగితే ప్రతి వెధవా గుండెలవేపు తినేసేట్టు చూడటం - ఈ ఇబ్బందులన్నీ ఉన్నాయి. గబ గబా నడవాలంటే చీర కుచ్చెళ్ళు అడ్డం వస్తాయి. పంజాబీ డ్రెస్సలా కారు. మొత్తం శరీరాన్ని కప్పుతుంది. రక్షణగా ఉంటుంది. చీర ఇలా వలిస్తే అలా వచ్చేస్తుంది. పంజాబీ డ్రెస్సుతోపాటు కొత్తగా, మొలతాడు కట్టుకోవడం, డ్రాయరు వేసుకోవడం కూడా అలవాటు చేసుకుంది.

ఇంటికి రాగానే ఆ దుస్తులు విడిచి చీర కట్టుకునేసరికి ప్రాణం తెరిపిన పడ్డట్టయింది. వందలాది సంవత్సరాలుగా తరతరాలుగా అలవాటయిన చీరకట్టు - అలా అనిపించడంలో ఆశ్చర్యంలేదు. ఆడవాళ్ళ చీరకట్టు వెనక మగవాళ్ళ కుత్సితం, స్వార్థం బాగా అర్థమైంది. చిన్నప్పుడు రాజోలు హైస్కూల్లో చదువుకుంటున్నప్పుడు ఛయినులు మాస్టారు చెప్పిన తెలుగు పద్యం గుర్తొచ్చింది. ద్రౌపదిని నిండు సభలో నిలబెట్టి చీరలు వొలిచే దృశ్యం. ఆ బాధని ద్రౌపది కృష్ణుడికి చెప్పుకుంటున్న తీరు.

" ఆ సభకేకవస్త్ర యగునట్టి నను౦గొని వచ్చి....."

ఆడదాన్ని ఒంటిబట్టతో చూసే మగవాడి బుద్ధి నేటికీ అలాగే ఉంది. లాగేస్తే సులభంగా రావాలన్నదే కదా మగవాడి ఉద్దేశం, ఆడదానికి మొలతాడు ఉండకూడదు. మగవాడికే మొలతాడు. 'మొలతాడు కట్టిన మొగాడు" అని సామెత కూడానూ, మగవాళ్ళు పూర్వం లంగోటి బిగించేవారు. లేదా కాసెకోక బిగించి కట్టుకునేవారు. ఇప్పుడు చక్కగా బిగువుగా పట్టినట్టు డ్రాయరు వేసుకుంటారు. మా శరీర పరిస్థితిని బట్టి వేసుకుంటాం, నీకు దాని అవసరం లేదు కదా - అని మొగవాళ్ళు అనొచ్చు. ఎవరి అవసరాలు వాళ్లవి.

ఒక రోజు మామూలు అలవాటు ప్రకారం ఇందుమణితో కలిసి షాపింగ్‌కు వెళ్లింది. బజారంతా తిరిగి కావలసిన వస్తువులన్నీ కొనుక్కొని ఇద్దరూ రిక్షా ఎక్కి ఇంటికొచ్చారు. వాళ్ళ ఇంటి దగ్గర ఇందుమణి దిగిపోయింది. తన ఇంటిదగ్గర తను రిక్షా దిగింది. సాయంత్రం అయిదున్నరకి కూడా ఎండ పెళ్ళున కాస్తోంది. మే నెల చివరి వారం, వొళ్ళంతా చమటగా ఉంది. చిరాగ్గా ఉంది. రిక్షావాడికి డబ్బులిచ్చి, సరుకుల సంచి బరువుతో గుమ్మం దాటి లోపలికొస్తోంది జలజాక్షి,

తనవేపు రెప్ప వెయ్యకుండా చూస్తోంది అత్తగారు.

జోళ్ళు విప్పి లోపలికి వెళుతూ - "ఎప్పుడొచ్చారు ? అంతా కులాసానా ?" అనడిగింది. ఏదో నేరం చేసిన దానిలా గబగబా పంజాబీ డ్రెస్సు విప్పేసి, చీర కట్టుకుని బాత్‌రూంకి వెళ్ళి కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని వచ్చింది. వంటచేస్తూనే కుశల ప్రశ్నలు ప్రారంభించింది జలజాక్షి.

ఆ మాటలు పక్కన పెట్టి - 'ఈ పంజాబీ డ్రెస్సు ఎన్నాళ్ళ నుంచీ ?' అన్నది అత్తగారు, ముందు ఈ సంగతి తేల్చు అన్న ధోరణిలో.

తనకు జరిగిన సంఘటన గురించి చెబుతుందా ? ఏమని చెబుతుంది ? చీరలో ఆడదానికి రక్షణ తక్కువ అంటూ తన ఆలోచనలన్నీ చెబుతుందా ? చెప్పి - ఆమెను ఒప్పించగలదా ? అసాధ్యం

"ఏం లేదు ఊరికేనే" - అని ఏదో చెప్పబోతుంటే సత్యనారాయణ వచ్చాడు. ఆ రోజు ఎందుకనో ఆఫీసునుంచి కొంచెం ముందుగానే వచ్చాడు. హమ్మయ్య ! బ్రతికిపోయాను - అనుకంటూ అక్కణ్ణించి తప్పుకుని మరొక పనిమీద అవతలి గదిలోకి వెళ్ళింది. పలకరింపు మాటలు పొడిపొడిగా పూర్తిచేసి మళ్ళీ మొదలుపెట్టింది పంజాబీ డ్రెస్సు సంగతి. అత్తగారిది నర్సీపట్నం. ఆరునెలల కొకసారయినా వచ్చి కొడుకును చూసి, ఒకపూట వుండి వెళుతుంటుంది.

"అదేనా ? పూరికేనే - మార్పుకోసం, నేనే వేసుకోమన్నాను. నీ తరం వేరు, ఇప్పటి తరం వేరు. ఈ రోజుల్లో ఆడవాళ్ళు నీలా వుంటారనుకున్నావా ? ఎన్ని ఫేషన్లు వచ్చాయి ...." అని సర్ది చెప్పడం మొదలు పెట్టాడు. అన్నీ విని - "లక్షణంగా చీరకట్టుకోవడం మానేసి...." అంటూ మళ్ళీ మొదటికొచ్చింది.

సత్యనారాయణ, జలజాక్షి శాయశక్తులా సమాధానాలు చెప్పబోయారు గాని, ఆమెని సమాధాన పరచ లేకపోయాడు. ఒక దశలో నిజం చెప్పేద్దామనుకుంది జలజాక్షి, కాని - తమాయించుకుంది. చీర కట్టులో కూడా రక్షణ వుండేలాగ, ఇలా ఒలవడానికి వీల్లేకుండా ఎలా ? అని ఆలోచించింది. గోచీపోసి కట్టుకుంటే కొంత నయం అని తోచింది. ఇన్నాళ్ళూ తన మట్టిబుర్రకి ఈ చిన్న విషయం తట్టనందుకు నవ్వుకుంది.

మర్నాడుదయం స్నానం చేసి, గోచీపోసి చీర కట్టుకుంది.

ఏదన్నా పూజ చేస్తావా ? కోవెలకి వెళ్తావా ? అని రకరకాల ప్రశ్నలు వేసింది అత్తగారు. అలాంటిదేం లేదని చెప్పింది. మరి గోచీ పోసి చీర ఎందుకు కట్టుకున్నావని మనసులోనే విసుక్కుంది జలజాక్షి, కోడలి వింత ప్రవర్తన అత్తగారికి కొంచెం కూడా అర్థంకాలేదు.

మధ్యాహ్నం భోజనం చేసి - చిన్న కునుకు తీసి లేచి బయలుదేరింది.

సత్యనారాయణ తల్లికి చీర జాకెట్టు తెచ్చాడు. బొట్టు పెట్టి, చీరా, జాకెట్టు, అరటిపళ్ళూ అత్తగారికిచ్చింది జలజాలక్షి. వెళ్తూవెళ్తూ మళ్లీ అడిగింది పంజాబీ డ్రెస్సు గురించి,

"ఊరికే సరదాకి వేసుకున్నాను. ఇంకెప్పుడూ వేసుకోను, మీ అబ్బాయే సరదాగా వేసుకోమంటేనూ-' అని చాలా ఓర్పుగా సమాధానం చెప్పింది.

ఆమె వెళ్ళాక ప్రాణం తెరిపిన పడింది జలజాక్షికి, ప్రస్తుతానికీ గండం గడించిందనుకుంది. మరీ వంటికి పట్టినట్టు కాకుండా కాస్త లూజుగా మరో రెండు పంజాబీ డ్రెస్సులు కుట్టుకుంది. పట్టుదలగా, బడటికి వెళ్ళినప్పుడల్లా, ఆ డ్రస్సులు వేసుకోవడం అలవాటు చేసుకుంటున్నది.

ఒకరోజు చల్లగాలికి డాబా మీద నిలబడింది. సత్యనారాయణ ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. చీకటి పడుతున్నా వీధి దీపాలు వెలగలేదు. ఇళ్ళల్లో దీపాల వెలుతురే వీధిలో పడుతోంది. ఒకమ్మాయి. - పాతికేళ్ళుంటాయి - ఆ దారమ్మట వెళుతోంది. జలజాక్షి గుండెలు దడదడా కొట్టుకున్నాయి. రోడ్డంతా

చీకటిగా ఉంది. నిర్మానుష్యంగా ఉంది. ఆ పిల్లేమిటి చీర కట్టుకుంది ? అమ్మో - ఏ పోకిరీ వెధవన్నా - ఆలోచించలేక తల తిరిగిపోయింది. ఇంకెప్పుడూ చీర కట్టుకోవద్దనీ, చాలా చిక్కులున్నాయనీ, అప్పుచేసయినా పంజాబీ డ్రెస్సులు కుట్టించుకోమని ఆ అమ్మాయికి బోధపరుద్దామని గబగబా డాబా దిగివచ్చింది. కాని ఆ అమ్మాయి చాలా దూరం వెళ్లిపోయి - ఆ సందులోకే మలుపు తిరిగింది. అమ్మో - ఆ సందులోకి - ఈ చీకట్లో -

ఆ సందులోకి వెళ్ళొద్దు - వెళ్ళొద్దని గట్టిగా అరుద్దామనుకుంది. ఆ అమ్మాయి కనిపించలేదు. ఏం చెయ్యడం .... చీకటి ఇంకా చిక్కబడింది. అయ్యో - పాపం ...

నాలుగు రోజులు గడిచాయి. సాయంత్రం నాలుగయింది. ఆ అమ్మాయి మళ్ళీ ఇటే వస్తున్నది. చీర కట్టుకునే ఉంది. జలజాక్షికి మనసుండ బట్టలేక, దగ్గరికి రానిచ్చి, ఇలా రమ్మని పిలచింది. ఆ అమ్మాయి - తన నెందుకు పిలుస్తున్నారా అని ఆశ్చర్యంతో దగ్గరికి వచ్చింది. దగ్గర్నించి మంచి వెలుతురులో చూసేసరికి - ఆ అమ్మాయి అందగత్తే అనిపించింది.

"నాలుగు రోజుల క్రితం రాత్రి ఏడుగంటల ప్రాంతంలో నువ్వు ఇలా వెళ్లావు కదూ-"

"ఔనండి-"

"క్షే-మం-గా ఇల్లు చేరుకున్నావా ?"

"క్షేమంగా చేరుకున్నానండి. ఎందుకమ్మా అలగడుగుతున్నారు ?'

"అబ్బే - ఏం లేదులే - నువ్వు ఏం చేస్తుంటావు ?"

"అవతలీదిలో షాపుకారు గారింట్లో పనిచేస్తున్నండి"

"సరేలే - వెళ్ళిరా-"

ఆ అమ్మాయి తిరిగి చూసుకుంటూ వెళ్లిపోయింది.

జలజాక్షి తనెందుకలా చేశానా అని ప్రశ్నించుకుంది. అయ్యో - చీర కట్టుకోవద్దు - చాలా కష్టాలున్నాయి - పంజాబీ డ్రెస్సు వేసుకోమని చెప్పడం మర్చిపోయానే అని బాధపడింది. తన కూతురికిప్పుడు మూడేళ్ళు. దానికి చిన్నప్పణ్ణించీ మంచి మంచి డ్రెస్సులు కుట్టించాలి, చీర అస్సలు కట్టుకోనివ్వకూడదనుకుంది.

పేపర్లలో స్త్రీ మీద అత్యాచారం జరిగిన వార్తలు చదువుతూ - చీర కట్టుకోకుండా, మంచి డ్రెస్సు వేసుకుంటే అంత ఘోరం జరిగి వుండేది కాదు గదా అని నిట్టూర్చింది. డ్రెస్సులోనైనా ఆడదానికి రక్షణ ఉందా ? అని కొత్తగా అనుమానం రావడం ప్రారంభమైంది జలజాక్షికి.

*రచన : 22-11-1997*

*ఆకాశవాణి విశాఖ కేంద్రం నుంచి ప్రసారమైంది*

*ప్రచురణ : 14-12-1997 ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం*